క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి

ఓజిలి: ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కే ప్రభాకర్‌రాజు అన్నారు. ఆక్రమణల విషయమై బుధవారం రెవెన్యూ కార్యాలయంలో కొండవల్లిపాడు గ్రామస్తులు సర్పంచ్ ఆధ్వర్యంలో డీటీ సాయిప్రియాంకకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కొండవల్లిపాడు రెవెన్యూలో సర్వేనంబర్ 1-1లో 20 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొంతమంది గ్రామస్తులు ఆక్రమించి సాగు చేస్తున్నారన్నారు. దీనిపై స్పందించిన ఆమె సమస్యను తహసీల్దార్ దృష్టి తీసుకెళ్లి ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మల రవి, సుబ్రమణ్యం, పరసా శంకర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ

సైదాపురం: పీఎం కిసాన్ లబ్ధి పొందిన రైతులందరూ తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని నెల్లూరు ఏడీ నందం శ్రీనివాసులు సూచించారు. సైదాపురం వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన వ్యవసాయ సహాయకులతో ఈకేవైసీపై సమీక్షించారు. అనంతరం కొమ్మిపాడు, లింగసముద్రం గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు అర్హత ఉండిన ప్రతి రైతూ ఈకేవైసీ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను కూడా అందజేయాలన్నారు. ఆయన వెంట ఏఓ హైమావతి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న గాలింపు

వెంకటగిరిరూరల్: మండలంలోని కలపాడు తెలుగుగంగ కాలువ ద్వారా గల్లంతైన మహిళ మహేశ్వరి గాలింపు చర్యలు బుధవారం కూడా కొనసాగాయి. అయినా ఆ చూకీ లభించలేదు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి అయ్యేవరకు అగ్నిమాపక అధికారులు తెలుగుగంగ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం సాయంత్రం వరకు కలపాడు గ్రామం వద్ద నుంచి రాంబట్లపల్లి గ్రామం వరకు సుమారు 12 కిలోమీటర్ల తెలుగుగంగ కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. అయినా మహేశ్వరి ఆచూకీ లభించలేదని అగ్నిమాపకశాఖ అధికారి ఆదినారాయణ తెలిపారు.

అంకితభావంతో పని చేయాలి



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

పెళ్లకూరు: అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన తహసీల్దార్ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెళ్లకూరు తహసీల్దార్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన రామయ్యను స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆ శాఖ సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రమేష్, మునిరాజ, సుధాకర్, వంశీ, రవిచంద్ర, చాణిక్య, తేజ పాల్గొన్నారు.

చిల్లకూరు వీఆర్వో సస్పెన్షన్

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు బిట్-2లో పనిచేస్తున్న వీఆర్వో ఏడుకొండలను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వీఆర్వోను తిరుపతి సమీపంలో ఎన్నికల విధుల నిర్వహణకు పంపారు. అక్కడ విధి నిర్వహణలో అలసత్వం పాటించినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తించి, అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, సంబంధిత వీఆర్వోను ఏడుకొండలను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

సంపద తయారీ కేంద్రం.. పునాదులకే పరిమితం



అర్థాంతరంగా ఆగిన పూలతోటలోని సంపద తయారీ కేంద్రం

దొరవారిసత్రం: పంచాయతీ కేంద్రమైన పూలతోట గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.5 లక్షలతో చేపట్టిన సంపద తయారీ కేంద్రం పునాదులకే పరిమితమైంది. ప్రస్తుతం ఆ పునాదుల కోసం వేసిన పిల్లర్లు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను వర్మికంపోస్టు మార్చడం కోసం నిర్మించిన తొట్లు కూడా క్రమేపీ దెబ్బ తింటూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చే ఆలోచన అధికారులకు ఏ మాత్రం పట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



కోట: తిన్నెలపూడిలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని తిన్నెలపూడిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్క్రిప్ట్‌నే పవన్ చదువుతున్నాడన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీ సంపత్‌కుమార్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మొబీన్, సర్పంచ్ శ్రీదేవి, పెంచలయ్య, సుధారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఊనుగుంటపాళెంలో జరిగిన జనగన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అంజమ్మ, ఎంపీడీఓ భవానీ చేతులమీదుగా లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.

సురక్షను విజయవంతం చేయాలి

ఓజిలి: మండలంలోని కొండవల్లిపాడు, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం విజయవంతం చేయాలని ఎంపీటీసీ సభ్యురాలు తుపాకుల మీనాక్షి, సర్పంచ్‌లు కదిరి లలితమ్మ, కొండూరు ప్రభాకరాజులు బుధవారం తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేక దుష్ప్రచారం

నాయుడుపేటటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని శంకరాపురం, గరిడీ వీధి సచివాలయాలకు సంబంధించి పాత బస్టాండ్ వద్ద రెండు చోట్ల బుధవారం కమిషనర్ ఐ శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గరిడీవీధి సచివాలయ పరిధిలో 866 మందికి, శంకరాపురం సచివాలయంలో 518 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కే చెంచయ్య, నాయకులు పీ చంద్రారెడ్డి, సీ విజయమ్మ, ఏ బాబు, సీ వెంకటేశ్వర్లు కన్మణి, ఎస్ మోహన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు

వలంటీర్లు ప్రజలకు పార్టీలకతీతంగా సేవలు అందిస్తున్నారని టీడీపీకి చెందిన యువజన విభాగం నాయకుడు బత్తల వాసు అన్నారు. బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వాసుకు అడ్మిన్ రమ్య చేతుల మీదుగా పలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ప్రజల కోసమే సురక్ష పథకం

సూళ్లూరుపేట రూరల్: ప్రజలు కార్యాలయాల చుట్టు తిరిగి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేశారని ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట మండలంలోని ఆబాక సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమీలా రాణి, సర్పంచ్‌లు టీ శారద, ఈ చిన్నరాజ, నాయకులు ఏ రమేష్‌రెడ్డి, బీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దుగ్గరాజపట్నంలో జగనన్న సురక్ష

వాకాడు: మండలంలోని దుగ్గరాజపట్నం సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ నరసింహారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె దామోదర్‌రెడ్డి, సర్పంచి శ్రావణి పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

వెంకటగిరిరూరల్: మండలంలోని సోమసానిగుంట పంచాయతీ పాలగొండసత్రంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.







నాయుడుపేటటౌన్: ధ్రువపత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ దీపిక, టీడీపీ నేత వాసుకు సర్టిఫికెట్ అందజేస్తున్న అడ్మిన్ రమ్య, సూళ్లూరుపేట రూరల్: ఆబాకలో..

కల్వర్టు ప్రారంభం



కల్వర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గూడూరురూరల్: మండలంలోని తిప్పవరప్పాడులో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తకాలువపై నిర్మించిన కల్వర్టును బుధవారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 200 మంది రైతులు కొత్త కాలువను దాటు కుని అవతలి వైపున ఉన్న పొలాలకు వెళ్లేందుకు 25 ఏళ్లుగా అవస్థలు పడుతుండేవారన్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తాను ఐసీఐసీఐ ఫౌండేషన్ వారితో చర్చించి కల్వర్టు నిర్మించాలని కోరామన్నారు. ఫౌండేషన్ వారు సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద రూ.23 లక్షల వ్య యంతో కల్వర్టును నిర్మించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఫౌండేషన్ అధికారులను రైతులు సత్కరించారు. ఐసీఐసీఐ ఫౌండేష న్ ప్రాజెక్ట్ మేనేజర్ శిరీష, డీడీఓ శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కే గోవర్ధన్, డైరెక్టర్ డీ కృష్ణారెడ్డి, ఇ.జనార్దన్‌రెడ్డి, వేణురెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ 2.40 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న విద్యార్థులు, దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు సమక్షంలో సీవీ రామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు లెక్కించారు. హుండీల లెక్కింపులో మొత్తం రూ 2,40,515 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తెలిపారు. నగదును పోలేరమ్మ పేరుతో ఉన్న బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవత చెంచు కిషోర్ శెట్టి, నల్లబోతులు రామారావు, పసల హరిబాబు, ఈఓ శాంతారావు, అర్చకులు ఆర్ మునిసురేష్, సిబ్బంది యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ బడికి వచ్చేలా చర్యలు

సైదాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులందరూ బడికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని రామసాగరం సచివాలయ ప్రత్యేకాధికారి రాధిక కోరారు. రామసాగరంలో బుధవారం ఐసీడీఎస్, పాఠశాల విద్యార్థులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయలలిత, చిన్నయ్య, దశరథరామరాజు, చిట్టిబాబు, వెంకటరమణయ్య, వీఆర్వో సుబ్బయ్య, నర్సులు ఉష, నాగేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, దేవసేన, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను విధిగా పాఠశాల్లో చేర్పించాలి

బడి బయట పిల్లలు తప్పని సరిగా పాఠశాల్లో చేర్పించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. కొమ్మిపాడు, సైదాపురంలోని పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలు ఎంత మంది ఉన్నారని సర్వే చేయాలన్నారు. అనంతరం కొమ్మిపాడు,సైదాపురం సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ దయాకర్ తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలకు రాయితీలు



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి కార్తీక్

చిల్లకూరు: ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ పలు రకాల రాయితీలను అందిస్తుందని ఉద్యానవన శాఖాధికారి కార్తీక్ అన్నారు. మండలంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆర్బీకేల్లో పనిచేసే వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఉద్యాన పంటలకు సంబంధించి త్వరగా ఈ- క్రాప్ నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షలో ఏఓ గూడూరు భవాని, ఏఎస్ఓ ఎస్‌కేఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరిరూరల్: చిరుధాన్యాలు, మునగలో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వీటిని తరుచుగా ఆహారంలో తీసుకుంటే మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం గృహ శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ పేర్కొన్నారు. పట్టణంలోని మల్లమ్మగుడి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన చిరుధాన్యాలు, మునగఆకుపొడితో వేరుశనగ చిక్కీ తయారీని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మునగాకు పొడి, వేరుశగపప్పులు, చిరుధాన్యాల్లో ప్రొటీన్లు అధికంగా ఉంటాయని, గృహిణులు వీటితో బిస్కెట్, చిక్కీలు తయారు చేసుకుని రోజువారీ ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శంషాద్‌బేగం పాల్గొన్నారు.

ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం



నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం ఆడికృత్తిక ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులతోపాటు 108 వేలాయుధాల శుద్ధి కార్యక్రమాన్ని చేసి, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సాముహిక సహస్త నామ పూజలు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తడ: పదో తరగతి ఉత్తీర్ణులైన విదార్థులు 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి తడ ఐటీఐ కళాశాలలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ ఎం దేవదానం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆగస్టు ఒకటో తేదీన ఉంటుందన్నారు. ఆగస్టు 3వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7993568224 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చెన్ను ఆదినారాయణరెడ్డికి నివాళి

రాపూరు: చెన్ను ఆదినారాయణ రెడ్డి మృతదేహానికి బుధవారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. స్థానిక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి తండ్రి చెన్ను ఆదినారాయణరెడ్డి (78) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రాపూరు మండలం తానంచర్ల గ్రామానికి చేరుకుని ఆదినారాయణరెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు భాస్కర్‌రెడ్డి, చెన్ను తిరుపాల్‌రెడ్డి, మెట్టుకూరు ధనంజయరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పీ మధుసూదన్‌రెడ్డి, పీ దయాకర్‌రెడ్డి, డీ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

గబ్బిలాలు.. ఆ ఊరి నేస్తాలు

- పరసారెడ్డిపల్లెలో దశాబ్దాలుగా ఆవాసం



సైదాపురం: మండలంలోని పరసారెడ్డిపల్లె రెండు వృక్షాలపై దశాబ్దాలుగా వందలాది గబ్బిలాలు నివసిస్తున్నాయి. అవి ఆ ఊరికి మిత్రులుగా మారాయి. వీటిని గ్రామంలో గబ్బిలాలు, కబోది పక్షులు, రాత్రి గువ్వలు అని పిలుస్తారు. పరసారెడ్డిపల్లెలో సుమారు 200 కుటుంబాలున్నాయి. ఈ గ్రామంలో సుమారు వందేళ్ల క్రితం రెండు రావి చెట్లు మొలిచి, పెద్దవయ్యాయి. ఆ చెట్లపై గబ్బిలాలు అవాసం ఏర్పరుచుకున్నాయి. చెట్లకు పగటి పూట వేలాడుతుంటాయి. రాత్రి వేళలో ఆహారం కోసం వెళతాయి. మళ్లీ ఉదయాన్నే వచ్చి చెట్లపై వేలాడుతూ ఉంటాయి. నాడు కొద్ది సంఖ్యలో ఉన్న పక్షులు నేడు వందల సంఖ్యకు పెరిగాయి. గ్రామస్తులు మూడు తరాలుగా వీటిని చూస్తునే ఉన్నారు. వాటిని తరమకుండా కాపాడుతూ వస్తున్నారు. గ్రామం నడిబొడ్డున చెట్లపై ఉన్న గబ్బిలాలనే గ్రామస్తులు దేవుళ్లగా భావించారు. ఆ చెట్ల వద్దనే నిత్య పూజలు చేస్తుంటారు.

వలంటీర్లకు వందనం

సేవకు సలాం



2020లో ఊటుకూరుకు చెందిన గిడిగి చెంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సైదాపురం: 2020-2021లో కోవిడ్ కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ విధించాయి. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వలంటీర్ల ద్వారా పేదలకు రూ.వెయ్యి ఆర్థిక సహాయంతో పాటు పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆపద వేళలో పేదలకు ఆపన్న హస్తంలా వలంటీర్ల తమ ప్రాణాలు పణంగా పెట్టి పింఛన్లు, ప్రభుత్వ సాయం అందించడంతో అప్పట్లో లబ్ధిదారులకు ఆర్థికంగా ఊరటనిచ్చింది. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో ఉన్న వారికి సైతం వలంటీర్లు అక్కడికే వెళ్లి పింఛన్లు అందించారు. లాక్‌డౌన్ సమయంలో వలంటీర్ల సేవలకు ప్రజలు సలాం కొట్టారు.

అండగా నిలిచారు..



నా కుటుంబ కరోనా మహమ్మారి బారిన పడిన సమయంలో అనేక అగచాట్లు పడ్డాం. బంధువులు సైతం మా వద్దకు రాలేకపోయారు. బయటకు పోయే పరిస్థితి లేనందున ఇంట్లోనే ఉన్నాం. అలాంటి సమయంలో మా వలంటీరు షేక్ షాకీర్ ధైర్యంగా ముందుకు వచ్చి మా కుటుంబానికి నిత్యావసర సరుకులు తెచ్చి ఇచ్చారు. అలాగే ప్రభుత్వ సాయం రూ.వెయ్యితో పాటు, పింఛన్ నగదు కూడా ఇచ్చారు. ఎందుకు అని ప్రశ్నిస్తే, పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అటువంటి వలంటీర్లపై అసత్యాలు ప్రచారం చేయడం దురదృష్టకరం.

–గిడిగి చెంగమ్మ ఊటుకూరు

పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి



జమిన్‌కొత్తపాళెంలో పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలను దహనం చేస్తున్న వలంటీర్లు

గూడూరురూరల్: కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించిన వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గూడూరులో బుధవారం వార్డు వలంటీర్లు నిరసన ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ రోజా మాట్లాడుతూ వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు ఆయేషా, కటమ్మ, సూర్య, శ్రీనాథ్, సురేంద్ర, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు

వాకాడు: నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వలంటీర్లు మండిపడ్డారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని జమిన్‌కొత్తపాళెం సచివాలయం వద్ద వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను నడిరోడ్డుపై తగలబెట్టారు. అనంతరం పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్ అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

పవన్ వ్యాఖ్యలు సమంజసం కాదు

వెంకటగిరి: వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం సుబ్రమణ్యం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వరధిలా వలంటీర్ల వ్యవస్థ పనిచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కరోన సమయంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు.

వలంటీర్లకు అండగా ఉంటాం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: వలంటీర్లకు వైఎస్సార్ ప్రభుత్వం, నాయకులు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం ఏపూరులో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో పుట్టినదే వలంటీర్ల వ్యవస్థ అన్నారు. ఇది ఉద్యోగం కాదు ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వ్యవస్థ అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డి నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, పీ దయాకర్‌రెడ్డి, సర్పంచ్ అశ్విని, సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, వరబాబు, శశిరెడ్డి, కే మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం

రాపూరు, కలువాయి,సైదాపురం మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో గురువారం తెలుగుగంగ అతిథి గృహం వద్ద వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. ఈ నెలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరిలో పర్యటన, బహిరంగసభకు సంబంధించి నాయకులతో సమీక్షిస్తారన్నారు.

పేదల చెంతకు సంక్షేమ పథకాలు



లబ్ధిదారులను పలకరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: అవినీతి, దళారీ వ్యవస్థ లేకుండా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇందుకు ప్రభుత్వానికి పేదలకు నడుమ వలంటీర్లు వారధులుగా నిలిచారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం వేనాడు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేనాడుకు చెందిన యువకులు గ్రామానికి 14 కిలోమీటర్ల దూరంలోని అటకానితిప్ప వరకు మోటార్ సైకిల్ ర్యాలీ చేసి, ఆయనకు స్వాగతం పలికారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు మారుమూల గ్రామాల్లోని ప్రతి ఇంటికీ చేరుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం వలంటీర్లే అని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, తడ, సూళ్లూరుపేట ఎంపీపీలు కే రఘురెడ్డి, ఏ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కే నదియ, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్‌కే సుందర్ రెడ్డి, నాయకులు కే వాసు మొదలియార్, అశోక్‌మొదలియార్, దీనదయాళ్, సదానందం మొదలియార్, కే ఆర్ముగం, పరమశివంరెడ్డి, మునుస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఒడిశా వ్యక్తి వద్ద కిలో గంజాయి స్వాధీనం



నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

గూడూరురూరల్: పట్టణంలో ఓ వ్యక్తి నుంచి కిలో గంజాయిని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ విజయకుమార్ కథనం మేరకు.. రెండో పట్టణంలోని గాంధీనగర్‌లో కూలీ పనులు చేసుకుంటున్న ఒడిశాకు చెందిన జయదేవ్ కొంత కాలంగా గంజాయి తీసుకువచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నట్లు ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన సీఐ తన సిబ్బందితో కలసి ఆ గాంధీనగర్‌లో తనిఖీలు చేశారు. ఆ ప్రాంతంలో నివాసమున్న జయదేవ్ వద్ద కిలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.30 వేలు చేస్తుందని ఎస్ఈబీ సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, కానిస్టేబుళ్లు ఆనంద్, రమేష్, ప్రసాద్, ఆనంద్, కృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.